ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

ఏఎంసీ మార్కెట్‌కు వారం రోజులు సెలవులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వారం రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనరెడ్డి తెలిపారు. శివరాత్రి పండుగ సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవులు ప్రకటించాలని శనివారం గంజ్ వర్తక సంఘం సభ్యులు కమిటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు కార్యదర్శి మాట్లాడుతూ మార్చి3న తిరిగి మార్కెట్‌లో పసుపు కొనుగోల్లు యథావిధిగా జరుగుతాయన్నారు. సెలవులలో రైతులు మార్కెట్ యార్డుకు పసుపు తీసుకరావద్దన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మపురి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ధర్మపురి, కమలాపూర్, నాగారం, బురుదోషిపల్లె, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, తిమ్మాపూర్, రామయ్యపల్లె, రాయపట్నం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల దృష్ట్యా సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

పెగడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇఆర్ఎస్ స్కీం 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ప్రతులతో ఉదయం 11.30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

ఫేర్‌వెల్ డే వేడుకలు

బీర్‌పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మపురి కళాశాల ప్రిన్సిపాల్ శైలజ చేతుల మీదుగా బహుమతులు అందించారు. గ్రామానికి చెందిన చిర్నేనేని శ్రీనివాస్ తన తండ్రీ నారాయణ స్మారకార్థంగా విరాళం అందించారు. మలబార్ గోల్డ్ సంస్థవారు బాలికల విద్యాను ప్రోత్సహించడానికి కళాశాలలో చదువుతున్న 28 మంది విద్యార్థినిలకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బొంతల గంగాధర్ కాలేయ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ జలందర్‌ను పరామర్శించారు. సంబంధిత వైద్యులను ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి వైద్య సహాయం నిమిత్తం అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.



సారంగాపూర్‌లో ఈజీఎస్ కూలీల హాజరును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- రెండేళ్లుగా నిలిచిన అలవెన్స్
- కేంద్రం కొత్త సాఫ్ట్‌వేర్‌లో లేని ఆప్షన్
- కూలీల నిరుత్సాహం

ఈజీఎస్ కూలీలకు అందని వేసవి భత్యం

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు అందించాల్సిన వేసవి భత్యం రెండు సంవత్సరాలుగా అందడం లేదు. ప్రస్తుత వేసవిలోనైనా భత్యం అందుతుందా లేదా అన్న సందిగ్ధం కూలీల్లో నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా 53.09 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 110.70 లక్షల మంది కూలీలుగా నమోదయ్యారు. ఇందులో 34.55 లక్షల జాబ్‌కార్డుల్లో 58.06 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో సగటున రోజుకు ఇప్పటి వరకు 12,618 గ్రామ పంచాయతీల్లో 2,02,928 మంది ఉపాధిహామీ పనులకు వెళ్తున్నట్లు సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 1.67 లక్షల జాబ్ కార్డులు ఉండగా అందులో 2.73 లక్షల మంది కూలీలున్నారు. వేసవిలో ఉపాధి పని దినాలు పెంచేందుకు ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు అదనపు భత్యాన్ని అందజేసేది. ప్రస్తుతం వేసవి భత్యం అందకపోవడంతో కూలీల్లో నిరాశ వ్యక్తం అవుతోంది.

గతంలో వేసవి భత్యం చెల్లింపులు ఇలా..

వేసవిలో పనిచేసిన కూలీలకు ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చి మాసంలో 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం అలవెన్స్‌గా చెల్లిస్తుండేవారు. ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గతంలో వినియోగించిన సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. రెండు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇర్మెటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. దీంతో రెండు సంవత్సరాలుగా ఉపాధిహామీ కూలి చెల్లింపులు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లిస్తోంది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యం చెల్లింపునకు సంబంధించిన ఆప్షన్ లేకపోవడంతో అందడం లేదని సంబంధితవర్గాలు అంటున్నాయి. ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఒక రోజుకు గరిష్టంగా రూ.300 కూలి చెల్లిస్తుంది. కూలీల వేతనాలు సైతం వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం వేసవి భత్యం ఇచ్చే అవకాశం లేక పోడంతో కూలీల అలవెన్స్‌కు బ్రేక్ పడింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇప్పటికే ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల పోషణ తదితర పనులు కొనసాగుతున్నాయి.

వేసవి భత్యం చెల్లించాలి

పొన్నం రాజవ్వ, ఈజీఎస్ కూలీ, జగిత్యాల



ఉపాధిహామీ కూలీలకు వేసవి అలవెన్స్ అందించాలి. ఎండా కాలంలో శ్రమకు ఓర్చి పనులు చేస్తున్నాం. గతంలో వేసవి భత్యం చెల్లించేవారు. రెండేళ్లుగా భత్యం అందడం లేదు. ప్రస్తుత వేసవి కాలంలోనైనా అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

అలవెన్స్ రావడం లేదు

రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



జాతీయ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు గతంలో ఇచ్చిన వేసవి భత్యం ప్రస్తుతం రావడం లేదు. కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి అలవెన్స్‌ల ఆప్షన్ లేదు. దీంతో రెండు సంవత్సరాలుగా వేసవి అలవెన్స్ అందడం లేదు. ఈ యేడాదికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండే సాఫ్ట్‌వేర్ ద్వారా వేసవి భత్యం ఇచ్చేవారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.



మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్

నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

8

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

8

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన భద్రతాపరమైన చర్యలపై ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు, ఎలక్షన్ రోజు, తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరికి క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలను కాపాడడం, ఎన్నికల నియమావళి పాటించేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్‌కు సంబంధించి 71 పోలింగ్ కేంద్రాల్లో 36,423 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘు చందర్, రాములు, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, సీఐలు రాంనర్సింహా రెడ్డి, వేణు గోపాల్, కృష్ణా రెడ్డి, రవి, నిరంజన్ రెడ్డి, ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు తదితరులు ఉన్నారు.

సంత్ సేవాలాల్ త్యాగాలు మరువలేనివి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కథలాపూర్‌లో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ సేవలు మరువలేనివని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో గిరిజనుల ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక చైతన్యవంతమైన పోరాటాలు చేసిన ఘనత సేవాలాల్‌కు దక్కిందన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, అజీం, ముదాం శేఖర్, గంగాధర్, చెదలు సత్యనారాయణ, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి'

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చు కొని ముందుకు సాగితే లక్ష్యసాధన సాధ్యమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, ఎస్‌కేఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి పుల్లా కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వడిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం కళాశాల క్రీడా సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. కాసుగంటి కుటుంబ సభ్యులచే డిగ్రీ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. అనంతరం జస్టిస్ కార్తీక్ మాట్లాడుతూ తాను కూడా ఇదే కళాశాలలో చదివి నేడు ఈ స్థాయికి ఎదిగానన్నారు. అంతకుముందు కాసుగంటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అన్ని మౌలిక వసతులతో పాటు, అనుభవం కలిగిన లెక్చరర్‌లచే విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి నారాయణ, కళాశాల పూర్వ విద్యార్థులు, పోషకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను లక్ష్యం మేరకు నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను లక్ష్యం మేరకు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఈజీఎస్, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాలల్లో ఈజీఎస్ కూలీల పెంపు కొరకు ప్రయత్నం చేయాలన్నారు. ఒక్కో గ్రామంలో కనీసం 50 మందికి తక్కువ కాకుండా ఉపాధి పనులు చేయించాలన్నారు. ఈజీఎస్ పనులపై పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.

అదేవిధంగా మార్చి నెల 10వ తేదీలోపు వంద శాతం ఇంటి పన్ను వసూళ్లను గ్రామాలలో పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి కాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి ఒక్క గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో త్రాగునీరు అందించే చేతి పంపులు, త్రీఫేస్, టూ ఫేస్ మోటర్లు రిపేర్లు చేసి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. నర్సరీల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్ని నర్సరీల్లో రిజిస్టర్లను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. వేసవి కాలం నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా నీటి సదుపాయం కల్పించి రక్షించాలన్నారు. నర్సరీల్లో ఈజీఎస్ కూలీలకు త్రాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న, ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిన వాటిని రెన్యువల్ చేయాలని, అదేవిదంగా పెండింగ్‌లో ఉన్న 12 సెల్ టవర్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ రఘువరన్, డీపీఓ మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి పాల్గొన్నారు.

'తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు'

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కన్నవారిని విస్మరించే కారుణ్య ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ హెచ్చరించారు. శనివారం కథలాపూర్, జగిత్యాల మండలాలకు చెందిన కారుణ్య ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సరిగా పోషించక పోవడంతో వారి అభ్యర్థన మేరకు వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనారోగ్య కారుణ్య నియామక పథకం విధి విధానాలను వారికి వివరించారు. వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. దీనికి స్పందించిన ఉద్యోగులు తమ తల్లిదండ్రులకు ఏలోటు రాకుండా చూసుకుటామని స్టాంప్ పేపర్ మీద రాసి ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కథలాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం లొంకరామన్న జాతర ఈనెల 27న జరుగుతున్న నేప థ్యంలో శనివారం గ్రామస్థులు జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. లొంకరామే శ్వరుడి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వెల్గటూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని డీఎస్పీ రఘు చందర్ సూచించారు. శనివారం వెల్గటూర్ లోని బ్రిలియంట్ మోడల్ స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ బాల బాలికలు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని అన్నారు. గురువులు నేర్పిన పాఠాలు శ్రద్ధగా విని పరీక్షల్లో ప్రతిభ చూపి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం బాల బాలికలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ, సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు 'అడ్లూరి'కి ఆహ్వానం

పెగడపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట రాజరాజేశ్వర స్వామి ఆలయకమిటీ సభ్యులు శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనుండగా ఆలయ కమిటీ సభ్యులు శనివారం క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సాగి కొండాల్ రావు, సత్యనారాయణ రావు, కడారి తిరుపతి, చెట్ల భాస్కర్, చిన్నం తిరుపతి, కుంచె రాజేందర్, మల్లేశం, చెట్ల తిరుపతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● మెట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అరుణ్ కుమార్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి అరుణ్ కుమార్

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):మెట్‌పల్లి కోర్టు ఆవరణలో మార్చి 8న నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అరుణ్ కుమార్ కోరారు. ఈ సంద ర్భంగా కోర్టు ఆవరణలో న్యాయ వాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

'యూరియా కొరత లేకుండా చూడాలి'

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా యూరియాకొరత సమస్యను స్థానిక రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందిన ఎమ్మెల్సీ రాష్ట్ర వ్యవసాయ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురాలవాలని కోరారు. వరిసాగు తగ్గి, మొక్కజొన్న పెరగడంవల్ల కొరత ఏర్పడిందని, సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని అధికారులు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట స్థానిక రైతులు, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో బాలింత మృతి


సౌమ్య (ఫైల్)

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మతాశిశుసంక్షేమ ఆస్పత్రిలో శుక్రవారం బాలింత మృతిచెందింది. మండలంలోని పెద్ద బొంకూర్‌కు చెందిన మిట్టపల్లి సౌమ్య (20) ప్రసవం కోసం ఈనెల 18న కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. బీపీ కంట్రోల్ కాకపోవడంతో రెండు, మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం శుక్రవారం మధ్యాహ్నం డాక్టర్లు శౌరయ్య, శ్రీదేవి, భవానీలు సీజేరియన్ చేశారు. మగశివువు జన్మనిచ్చిన అనంతరం సౌమ్యకు ఛాతిలో నొప్పి అధికమైంది. వెంటనే వైద్యులు అంబులెన్స్‌లో సౌమ్యను కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. కరీంనగర్ ఆస్పత్రికి తీసుకు వచ్చేసరికే సౌమ్య మరణించిందని అక్కడి వైద్యులు పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఛాతినొప్పి రాగానే ఇంజక్షన్, టాబ్లెట్లు ఇవ్వగానే పరిస్థితి విషమంగా అయ్యిందని, పెద్దపల్లి ఆసుపత్రిలోనే సౌమ్య మరణించినట్లు పేర్కొంటున్నారు. సౌమ్య మరణంపై అనుమానాలు ఉన్నట్లు భర్త కలవేన నవీన్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరొకరికి గాయాలు


రాకేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్‌లోని రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన జేటి రాకేష్(35) మృతి చెందగా గొండ అరుణ్(32)కు తీవ్రగాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన రాకేష్, అతడి స్నేహితుడు అరుణ్ మరో స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి శుక్రవారం రాత్రి బైక్‌పై మల్కాపూర్‌కు వెళ్లారు. వేడుకలు ముగిసిన తరువాత తిరిగి కరీంనగర్‌కు బయల్దేరారు. చింతకుంట గాంధీనగర్ కరీంనగర్-సిరిసిల్ల రోడ్డుపై దాసరి విజయగార్డెన్‌వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో రాకేష్ ఎగిరిరోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అరుణ్‌కు తల, కాలుకు గాయాలయ్యాయి. రాకేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

జ్యోతినగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు సమీప రాజీవ్‌రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో చంద్రయ్య అనే కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తల, భుజం, కాలుకు తీవ్రగాయాలైన చంద్రయ్యను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు పంపించారు. నర్రశాలపల్లికి చెందిన చంద్రయ్య ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు అందక పంచాయతీ ఆపరేటర్ల ఇక్కట్లు


జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

- నాలుగు నెలలుగా ఎదురుచూపులు
- రాష్ట్రవ్యాప్తంగా 1,282 మంది ఈ-పంచాయతీ ఆపరేటర్ల అవస్థలు

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,282 మంది పనిచేస్తుండగా జగిత్యాల జిల్లాలో 62 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో జూనియర్లకు నెలకు రూ.19,500, సీనియర్లకు రూ.22,750 వేతనం నిర్ణయించారు. కానీ వారికి సక్రమంగా జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కంప్యూటర్లు ఉన్న పంచాయతీలతో పాటు మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ జనన-మరణ ధ్రువీకరణ, ఇతర పత్రాలు అందిస్తారు. ప్రజాపాలన దరఖాస్తులనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా తదితర కార్యక్రమాల లబ్ధిదారుల పేర్లు కంప్యూటరీకరించడం వంటి సేవలను ఈ-పంచాయతీ ఆపరేటర్లు నిర్వహిస్తున్నారు. కేంద్రం నుంచి ఆర్థికం సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లోనే జమకాగానే ఇందులో నుంచే ఆపరేటర్లకు వేతనాలు చెల్లించే వారు. కొన్నాళ్లుగా ఇవి నిలిచిపోవడంతో వేతనాలు అందడం లేదు. కొన్ని పంచాయతీల్లో సాధారణ నిధుల నుంచి వేతనాలు చెల్లించగా ప్రస్తుతం అవి కూడా చెల్లించడం లేదు.

● పరిష్కారానికి నోచుకోని డిమాండ్లు

గ్రామ పంచాయతీల్లో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించే దిశగా సాంకేతికత ఆధారంగా ప్రజలకు అందించే అన్ని రకాల సేవలను కంప్యూటరీకరణ చేయడానికి 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఈ-పంచాయతీ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లను వివిధ దశల్లో నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,282 మంది ఆపరేటర్లు, ప్రాజెక్టు మేనేజర్లు పనిచేస్తున్నారు. ఈ-పంచాయతీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగుల్లో ఎవరైనా మరణిస్తే కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దకాలంగా విధులు నిర్వహిస్తున్న ప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, శ్రమకు తగిన ఫలితం లభించకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు.

అప్పులు చేస్తున్నాం

-సంతోష్, జిల్లా అధ్యక్షుడు, ఈ-పంచాయతీ ఆపరేటర్ల సంఘం, జగిత్యాల



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం. ఉన్నతాధికారులు ఏ పని అప్పగించినా రాత్రనక, పగలనక కష్టపడుతున్నాం. వేతనాలు రాక కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రతీ నెలా 5వ తేదీ లోపు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఆస్తి వివాదంలో తండ్రికి మద్దతు ఇస్తున్నాడని..
చిన్నాన్న కుమారుడిపై హత్యాయత్నం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ ఆస్తివివాదంలో జోక్యం చేసుకుంటూ తల్లిదండ్రులకు మద్దతు ఇస్తున్నారనే కక్షతో శనివారం గోదావరిఖని తిలక్ నగర్‌లో మహ్మద్ ఖలీల్(25) అనే వ్యక్తిపై అతని పెదనాన్న కుమారులు గౌస్, అంకూస్‌లు తల్వార్లతో దాడిచేసి హత్యాయత్నంకు పాల్పడ్డారు. గొంతు కోయడంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఖలీల్ సోదరుడు సలీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరి పెద్దనాన్న శంషోద్దీన్ సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అవుతున్నారు. అతడికి అంకూస్, గౌస్ సంతానం. వారసత్వ ఆస్తుల పంపకాల విషయంలో తండ్రీకొడుకుల మధ్యగొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు తండ్రిపై దాడిచేశారు. దీంతో శంషోద్దీన్ పెద్దపల్లికి వెళ్లేందుకు సహకరించాల్సిందిగా హనుమాన్‌నగర్‌లో నివాసముండే సోదరుడి కుమారుడు సలీం, కలీంలను కోరాడు. కలీం టాటాఏస్ డ్రైవర్‌గా పనిచే స్తున్నాడు. అతడు లగేజి పంపిం చేందుకు వాహనాన్ని సమకూర్చారు. సామాగ్రి సర్దు తుండగా అంకూస్, గౌస్‌లు సలీంపై దాడి చేశారు. అడ్డువెళ్లిన కలీంను పట్టుకుని తల్వార్‌తో దాడిచేసి గొంతు కోశారు. నిందితులు పరారీలో ఉన్నారు. బాధితులు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బావిలోపడి రైతు మృతి

జూలపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరికుంట గ్రామానికి చెందిన దొడ్ల లచ్చయ్య(58) అనేరైతు వ్యవసాయ బావిలోని పైపును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలోపడి మృతిచెందాడు. కుమ్మరికుంట గ్రామశివారులో చేనుకు నీరు పారించడానికి శుక్రవారం వెళ్ళాడు. మోటార్‌పైపు జారిపోవడంతో దానిని సరిచేయడానికి లచ్చయ్య ప్రయత్నిస్తుండగా కాలుజారి బావిలో పడడంతో మృతిచెందినట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్న మల్లికార్జున్‌రెడ్డి



మల్లికార్జున్‌రెడ్డికి అవార్డును అందజేస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

చొప్పదండి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన యువరైతు మావురం మల్లికార్జున్‌రెడ్డి జాతీయఉత్తమరైతు అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని ఐకార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్రవ్యవసాయశాఖమంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ అవార్డును మల్లికార్జున్‌రెడ్డికి అందజేశారు. ఐసీఏఆర్ సంస్థ ఫెలోఫార్మర్ అవార్డుకు మల్లికార్జున్ రెడ్డిని ఎంపికచేయగా అవార్డును సంస్థ కేంద్ర మంత్రిచేతుల మీదుగా అందజేసింది. జాతీయస్థాయిలో ఫెలోఫార్మర్ అవార్డుకు ఐకార్ సంస్థ ఆరుగురు రైతులను ఎంపిక చేయగా దక్షిణ భారతదేశం నుంచి మల్లికార్జున్‌రెడ్డి ఒక్కరికే ఈఅవార్డు రావడం విశేషం. గతంలో మల్లికార్జున్ రెడ్డికి ఐసీఏఆర్(భారత్‌వ్యవసాయ పరిశోధన సంస్థ)ఇన్నోవేటివ్‌ఫార్మర్ అవార్డును అందజేసింది. జాతీయ అవార్డు మల్లికార్జున్ రెడ్డికి రావడం ఇది రెండోసారి కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేడిగడ్డకు మరమ్మతులు చేసి.. రైతులకు నీరివ్వండి

● మాజీ ఎంపీ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న మాజీఎంపీ బి వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డకు మరమ్మతులు చేయాలని, పంటలు ఎండిపోకుండా సాగు నీరందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసినట్లు మాజీ ఎంపీబోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం కరీంనగర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సాగుచేసిన పంటలు ఇప్పటికే ఎండిపోతున్నాయని, నీరందించి అండగా నిలవాల్సిన ప్రభుత్వం పంటలు తగ్గించుకోవాలని సూచించడాన్ని తప్పుబట్టారు. బంగాళాఖాతంలో కలుస్తున్న గోదావరి, కృష్ణ నదుల నీటిని వినియోగించుకునేందుకు మాజీసీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడంతో 2023 వరకు 50 శాతం వరి ఉత్పత్తి పెరిగిదేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో నిలిచిందన్నారు. మేడిగడ్డ కుంగిపోవడాన్ని కేసీఆర్‌కు అంటగడుతున్నారని, లోపం జరిగినదానికి మరమ్మతు చేయకుండా వదిలిపెట్టారని మండిపడ్డారు. గత వర్షాకాలంలో మేడిగడ్డ వద్ద భారీగా నీరు నిలిచినా, ఇటీవల మేడిగడ్డ వద్ద భూకంపం చోటు చేసుకున్నా మేడిగడ్డ మిల్లీమీటరు కూడా కదలలేదని, అంటే మేడిగడ్డలో చిన్నపాటి లోపం జరిగిందని తెలిపోయినా ఎందుకు మరమ్మతు చేయలేదని ప్రశ్నించారు. డ్యాంసేఫ్టీయాక్టు రిపోర్టు పేరుతో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుకాయిస్తున్నారని, డ్యాం సేఫ్టీయాక్టు ఎక్కడ కూడా మరమ్మతు చేయవద్దని చెప్పలేదని అన్నారు. ఆయాక్టు కేవలం సూచన చేస్తుందని, యజ మాని ఏదైనా నిర్ణయం తీసుకో వచ్చని చెబుతుందని అన్నారు. మేడిగడ్డ డ్యాంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలే యజమానులని, ప్రభుత్వం యాక్టుపేరుతో కాల యాపన చేస్తోందని విమర్శిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డకు మరమ్మతు చేయక పోవడంతో లక్షలాది ఎకరాల వరి ఎండిపోతోందని, ఆయన నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథార్టీ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌తో చర్చించాలని, మేడిగడ్డకు మరమ్మతుచేసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్‌చేశారు. మేడిగడ్డ కుంగిపోయిన వెంటనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డ్యామ్ సేఫ్టీ ఇంజనీర్లను పిలిపించారని, మేడిగడ్డ బ్యారేజీ నిర్వహణ సరిగాలేదని, డిజైన్‌లోనే లోపముందంటూ చెప్పించారని అన్నారు. కిషన్‌రెడ్డి డ్యామ్ సేఫ్టీ వారి నివేదిక ఇప్పించి ఎందుకు మేడిగడ్డకు మరమ్మతులు చేయించడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయని, పలువురు రైతులు ట్యాంకర్లతో నీరుపోసి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మార్చి నెలాఖరు, ఏప్రిల్ మొదటివారం వరకు సాగునీరు అందించాల్సిన అవసరముందన్నారు. మేడిగడ్డకు మరమ్మతు చేయకుండా కేసీఆర్‌ను బదనాం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నార న్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారంటీలతో రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా జూన్, జూలై వరకు మేడిగడ్డకు మరమ్మతు చేయించాలన్నారు. పంటలను కాపాడేందుకు మేడిగడ్డ కిందనుంచి వచ్చే ప్రాణహిత, ఇంద్రావతినీటిని ఎత్తిపోయాలని, మేడిగడ్డ బ్యాక్‌వాటర్‌ను ఎల్లంపల్లి, సుందిళ్ల,మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లకు తరలించి సాగు, తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీరామకృష్ణారావు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు


రామకృష్ణను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అంతర్గాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద గంజాయి రవాణా చేస్తున్న తీగుల్ల రామకృష్ణను శనివారం సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అతిరాజపల్లికి చెందిన నిందితుడు రామకృష్ణ రైలు మార్గం ద్వారా గంజాయి రవాణా చేస్తున్నాడనే అందిన సమాచారం మేరకు రామగుండం రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద పట్టుకున్నామని తెలిపారు. తనిఖీ చేయగా బ్యాగులో 15కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.8లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంధ్యారాణి పేర్కొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బీర్‌పూర్,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శనివారం సీజ్‌చేసి ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లపై కేసునమోదుచేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. శనివారం ఉదయం ఆరెపల్లి నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదుట్రాక్టర్లను రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ పట్టుకొని బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ఆర్ఐశ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఐదుట్రాక్టర్లను సీజ్‌చేసి యాజమానులు, డ్రైవర్లు అయిన జక్కుల శివ, కుంభాల శేఖర్, కామెరరాజేష్, చీర్నేనిశ్రీనివాస్, జంగిలి మహేష్‌లపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

భీమారం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడెం శివారులో 45 ట్రిప్పుల ఇసుకడంప్‌ను మైనింగ్ ఏడీ జయసింగ్ శనివారం సీజ్ చేశారు. మండలంలోని వరద కాలువ వెంబడి తనిఖీలు చేస్తుండగా మన్నెగూడెంలో ఇసుకనిల్వలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమరవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ ఆర్ఐ నాగేష్, భీమారం ఆర్ఐ రాజారాం పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ధర్మపురి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తప్పుడుపత్రాలు సృష్టించి ఆస్తిపట్టా చేయించుకున్న నలుగురిపైశనివారం కేసు నమోదుచేసినట్లు ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన నర్మూల రాజబోసు ఆస్తిని భార్య నర్మూల శాంతమ్మ, ముగ్గురు కూతుర్లు చుక్కల లక్ష్మీ, గరిగె లక్ష్మీ, గజ్జి రాధ కలిసి తప్పుడు అఫిడవిట్ తయారుచేసినట్లు పేర్కొన్నారు. నర్మూల రాజబోసు కొడుకు నర్మూల రమేష్ చనిపోయినట్లు చిత్రీకరించి తద్వారా ఆస్తిని చుక్కల లక్ష్మీ, గరిగెలక్ష్మీ, గజ్జి రాధ అనేవ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు దారుడికి ఆస్తి రాకుండా చనిపోయినట్లు చిత్రీకరించి ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న సదరు వ్యక్తులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎండలతో జాగ్రత్త..


- వడదెబ్బ తగిలే అవకాశం
- గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు పాటించాలి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సూచనలు



సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్చి నెల రాకముందే ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఇంకా ఎలా ఉం టుందోనని ప్రజలు బెంబేలెత్తుతు న్నారు. సాధారణంగా మార్చి మొదలైన తరువాత ఎండలు ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. కాని ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలోనే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఎండలకు వడదెబ్బతో ఆనారోగ్యం పాలవ్వకుండా ఉండేందుకు తగిన జాగ్రతలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలియ చేశారు. ముఖ్యంగా ఎండలో పనిచేసే వారు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత పనిచే యాలని సూచించారు. తీవ్ర మైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు ఎండ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుం దని తెలిపారు.



● వడదెబ్బ లక్షణాలు



శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాడీ వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, చర్మం ఎండిపోవడం, నీర సంగా ఉంటూ తడబడడం, శీరరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం పసుపు రంగులో ఉండి మంటగా రావడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలితే పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరుకునే అవకాశ ఉంది.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వడదెబ్బ తగిలిన వారిని చల్లని నీడ ప్రదేశంలో ఉండాలి. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు ఉపయోగించాలి. తెల్లని కాటన్ వస్త్రాతలు వదులుగా ఉన్నవి ధరించాలి.



బయటకు వెళ్ళేటప్పుడు నెత్తిన టోపి లేదా రుమాలు ధరించాలి. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగొద్దు. ఉప్పు కలిపిన మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రవం తాగడం మంచిది. ఇంటిలోపల ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంటి కిటికీలకు నీటితో తడిపిన తట్టును కట్టుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా చల్లని గాలి నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి. దుస్తులను వదులు చేసి గాలి తగిలేలా చేయాలి. చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

వేసవిలో జగ్రత్తగా ఉండాలి

- డాక్టర్ వెంకటరమణ, కరీంనగర్ డీఎంహెచ్‌వో



మార్చి నెల ప్రారంభం కాకముందే ఎండల తీవ్రత పెరిగింది. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగవదు. అవసరమైతే తప్ప బయటకు రావద్దు. రావాల్సి వస్తే నెత్తిన టోపి లేదా గొడుగుతో రావాలి. ఎండలో తిరగితితేనే వడదెబ్బ తగులుతుందని అనుకోవడం పొరపాటు. ఇనుప రేకుల కింద ఉన్నా ఎండదెబ్బ తగులుతుంది. మసాలాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోకూడదు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలి. ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది.

పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు


స్వాధీనం చేస్తున్న సారా తయారీ వస్తువులు

కోనరావుపేట ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం రామన్నపల్లె గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గుడుంబా తయారీకి ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని పలువురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై శైలజ, సిబ్బంది అలీ, రాజు, మల్లేష్, యోగి, వర్మ, శంకర్, సుమన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్య

● నిందితుడి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన రామలక్ష్మి అనే మహిళను ఆమె భర్త హోంగార్డు గట్టయ్య హత్య చేశాడు. శుక్రవారం భార్యతో ఘర్షణ పడ్డ గట్టయ్య ఆమె తలను బలంగా గోడకు కొట్టడంతో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గట్టయ్య రామగుండం పోలీస్ కమిషరేట్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. గట్టయ్య వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడం, డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెడుతుండడం, ఇంట్లో అవసరాలకు డబ్బులు ఇవ్వకపోవడంతో భార్య రామలక్ష్మి ప్రశ్నించింది. ఈ విషయమై పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. శుక్రవారం ఇదే విషయంలో భార్యభర్తల మధ్య ఘర్షణ జరుగగా కోపోద్రిక్తుడైన గట్టయ్య భార్యపై దాడి చేసి హత్య చేశాడు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి గట్టయ్యను అరెస్టు చేశారు.

స్వాగత్ కమాన్‌ను ఢీకొట్టిన లారీ: తప్పిన ప్రమాదం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటుచేసిన స్వాగత్‌కమాన్‌ను లారీ ఢీకొట్టింది. హెవీలోడుతో వెళుతున్న లారీడ్రైవర్ చూసుకోకపోవడంతోపైన కప్పునకు తగిలి కమాన్ కూలిపోయేలా మారింది. దీంతో గమనించిన వాహనదారులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది.

ఎమ్మెల్సీ అభ్యర్థులతో కలెక్టర్ సమావేశం

కరీంనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులతో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల స్థానానికి 56, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది పోటీలో ఉన్నారన్నారు. 394 మంది మైక్రో అబ్జర్వర్లు, 335 మంది జోనల్ అధికారులు 2,606 మంది పోలింగ్ అధికారులు, 864 మంది ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారన్నారు. పట్టభద్రుల ఓటర్లు 3,55,159 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 27,088 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందన్నారు. పోలింగ్ నిర్వహిస్తున్న అన్ని జిల్లాల్లో 93 కామన్ పోలింగ్‌స్టేషన్లు (టీచర్ అండ్ కామన్ గ్రాడ్యుయేట్స్), 406 గ్రాడ్యుయేట్, 181 టీచర్స్ పోలింగ్ స్టేషన్లు కలిపి 680 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలన్నారు. అభ్యర్థులకు కావాల్సిన అనుమతుల కోసం జిల్లాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని సూచించారు. 100 శాతం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తామన్నారు. అభ్యర్థులకు తమకు ఏజెంట్ కావాలంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియామవళిని కచ్చితంగా పాటించాలని ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మికిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఎం రేవంత్ రెడ్డి రాక

- పట్టభద్రుల ఎన్నికపై ఫోకస్
- గెలుపే లక్ష్యంగా ప్రచార వ్యూహం
- ప్రభుత్వం చేసింది...చేసేది వివరించనున్న ముఖ్యమంత్రి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. ఈనెల 25న ప్రచారం ముగియనుండగా 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన పథకాలు, చేకూర్చిన లబ్ధి, భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలు వివరించి పట్టభద్రుల్లో పార్టీపై మరింత సానుకూలత సాధించే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఈ పర్యటనను రూపొందించుకున్నారని చెబుతున్నారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు.

● సమన్వయ బాధ్యతలు సంతోష్‌కుమార్ రుద్రకు..

ఎమ్మెల్సీ ఎన్నికల స్ట్రాటజీ అమలు, సమన్వయ బాధ్యతలను సంతోష్‌కుమార్ రుద్రకు అప్పగిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ రూపొందించిన వ్యూహాన్ని మండల, గ్రామ, బూత్ స్థాయిల్లోకి తీసుకువెళ్లి ఆయన అమలు చేస్తారు. ఓటరును కలిసి పోలింగ్ బూత్‌కు వచ్చేలా చూడడం, క్షేత్రస్థాయి శ్రేణులు, మండల, జిల్లా స్థాయి నాయకుల సమన్వయం చేసే బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల సమన్వయంతో అభ్యర్థి గెలుపునకు కృషిచేసి ఎప్పటికప్పుడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి రిపోర్టు చేయాలని సూచించారు. గత ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటుతోనే జీవన్‌రెడ్డిని గెలిపించుకున్న మాదిరిగా ఈసారి కూడా నరేందర్‌రెడ్డిని గెలిపించుకొని తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నది.

● ఎస్సారార్ కళాశాల మైదానంలో..

కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రజా పాలన వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్ర మాలను వివరించి, పట్టభద్రులు ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ముఖ్యమంత్రి కోరాలని భావిస్తున్నట్లు సమాచారం. మొదటి ప్రాధాన్య ఓటుతోనే గెలిచేలా ఎన్నికల వ్యూహా న్ని సిద్ధం చేసుకుని రాబోయే మూడు రోజుల్లో క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరును కలిసి అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కృషిచేసేలా వ్యూహం రూపొందించి మంత్రులు, ఎమ్మెల్యేల పర్య వేక్షణలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య



ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న మల్క కొమురయ్య

పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య తెలిపారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ కాలేజీలో ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా టీచర్ల సమస్యలను పట్టించుకోలేదని కొమురయ్య ఆరోపించారు. తాను చిన్నప్పుడు ఈ ప్రాంతంలోనే చదువుకున్నట్లు తెలిపారు. అప్పుడు చదువు చెప్పిన టీచర్ల వల్లే ఇవాళ పలువురు గొప్పస్థాయిలో ఉన్నారన్నారు. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా టీచర్ల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. సిద్ధాంతాలు కలిగిన బీజేపీ నుంచి పోటీ చేస్తున్న తాను పార్టీలు, జెండాలు మార్చే ప్రసక్తే లేదన్నారు. టీచర్లకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడతానని హామీ ఇచ్చారు. అనంతరం టీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి కావడం సంతోషంగా ఉందన్నారు. తన మూలాలు మర్చిపోకుండా పుట్టిన గడ్డ కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఆయనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

ఓదెల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారంనుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఉత్సవాలు జూలై 14 వరకు నిర్వహించనున్నారు. 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు నిత్యోత్సవం, అనంతరం సాయంత్రం నాలుగు గంటల వరకు సామూహిక రుద్రాభిషేకం, రాత్రి రథోత్సవం, రాత్రి 11.45 గంటల నుంచి లింగోద్భవ కాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, అర్చనలు పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో వైభవంగా శివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు, భక్తులకు ఏర్పాట్లు చేశారు. 23 బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఆగ్రోదకము ఉచ్చారణము, మహాగణపతి పూజ, గౌరీ పూజ, తదితర పూజలు నిర్వహిస్తారు. 24న సోమవారం భ్రమరాం బ మల్లికార్జున స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజన బృందాల తో గానలహ, తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఓదెల మల్లికార్జున స్వామి ఆలయం, ధర్మపురిలోని రామలింగేశ్వర స్వామి

ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26న బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామి వారలకు అభిషేకం, మహాలింగార్చన, కల్యాణం పూజాది కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు. భక్తులు 516 రూపాయలు చెల్లించి తమ గోత్ర నామాలతో పూజలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఉత్సవాల కోసం ఆలయానికి రంగులు వేయించినట్లు ఆయన వివరించారు. విద్యుత్ దీపాలతో అలంకరణ చేయించి, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచినీటి వసతి కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలు విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

● పూజా కార్యక్రమాలు

మహా శివరాత్రి సందర్భంగా ధర్మపురి రామలింగేశ్వరస్వామిఆలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు అభిషేకాలు, దర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు మహాలింగార్చన, రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు లింగోద్భవ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి 1 నుంచి 3 వరకు శివకల్యాణం, అనంతరం రథోత్సవం జరుగుతుందని వివరించారు.

ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు

- ఓయూ జేఏసీ నాయకుడు కోడూరి రఘు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ మద్దతు ప్రకటించినట్లు జేఏసీ నాయకుడు కోడూరి రఘు తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలు అగ్రవర్ణ పెత్తందారులకు మాత్రమే టికెట్లు ఇచ్చి ప్రోత్సహించాయని తెలిపారు. డాక్టర్ ప్రసన్న హరికృష్ణ బహుజన బిడ్డ అని, ఉస్మానియా విద్యార్థిగా విద్యను అభ్యసించారని తెలిపారు. ఎందరో విద్యార్థులను ప్రోత్సహించిన ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రసన్న హరికృష్ణను గెలిపించి మండలికి పంపిస్తే బహుజన గొంతుకను వినిపిస్తారని, నిరుద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ జేఏసీ నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికలు గెలిచిన వెంటనే కాంగ్రెస్‌పై యుద్ధం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రారంభిస్తామని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పచ్చీస్ ప్రభారీల సమావేశంలో ఆయన మాట్లారు. ఈ ఎన్నికలు నమ్మక ద్రోహానికి నయవంచనకు, పోరాటానికి ధర్మ రక్షణకు మధ్య జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ నయవంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బీజేపీ గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్‌పై యుద్ధం ప్రారంభిస్తుందన్నారు. తనకు కేంద్రమంత్రి పదవి ముఖ్యం కాదని, ప్రజలే తనకు ముఖ్యమన్నారు. కాంగ్రెస్ బీసీలకు వెన్నుపోటు పొడిచి ఇవాళ బీసీ జపం చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రావడం తథ్యమన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని పార్టీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి

స్వతంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు గెలిచినా కాంగ్రెస్‌లో చేరతారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేక పోటీ నుంచి తప్పుకున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకక బయటి వాళ్లను అరువు తెచ్చుకుందన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పోటీ చేయబోనని తప్పుకోవడమే ఆ పార్టీపై వ్యతిరేకతకు నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఓటు కోసం ఏడు వేల నుంచి పదివేల రూపాయలు పంచుతున్నారని, అయినా బాధపడాల్సిన పనిలేదన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు లక్ష నుంచి పది లక్షల దాకా వసూలు చేయబోతున్నారన్నారు. ఎల్ఆర్ఎస్ డబ్బులు ఆయా వార్డుల్లో అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన డబ్బంతా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకే జమ చేయాలని నిబంధన తీసుకు వచ్చిందన్నారు. గత ఎన్నికల్లో ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాడి జైలుకు, లాఠీ దెబ్బలు తిన్నదెవరో గుర్తుంచుకోవాలన్నారు. పీఆర్సీలు, డీఏలు, బదిలీలు, ప్రమోషన్లు గ్రూప్-1 అభ్యర్థుల కోసం పోరాడిందెవరో గుర్తుంచుకోవాలన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి మాట్లాడుతూ తాను గెలిస్తే వేతనమంతా పాఠశాలల అభివృద్ధికే ఖర్చు చేస్తానని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, గోపి, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి శంకర్, వాసల రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం చేసినా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నాం

- రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేసినా తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులతో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరుకానున్నారని తెలిపారు. తమ ప్రభుత్వంలో సిరిసిల్ల చేనేత కార్మికుల బకాయిలను తీర్చడంతోపాటు ఉపాధి కల్పించామని, మహిళా సంఘాలకు చీరల ఆర్డర్ ఇచ్చి అండగా నిలిచామని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం కోసం సీఎం నిధులు కేటాయించి, శంకుస్థాపన చేశారన్నారు. మానేరు ముంపు గ్రామాల బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం 4,600 ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీకి లా కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ వస్తున్నాయన్నారు. ఆది, సోమవారాల్లో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని పట్టభద్రు లను కోరనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్‌కుమార్ ఆరేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గా నికి, రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలని, ఆ తర్వాతనే ఎమ్మెల్సీ ఓట్లు అడగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేస్తే బీజేపీ అడ్డుకుంటూ ఆఫిడవిట్ ఇచ్చిందన్నారు. రంజాన్ నెలలో ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు కల్పిస్తే బీజేపీ నాయకులు మత రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈనెల 24న సీఎం సభకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పట్టభద్రులైన ఓటరును తీసుకురా వాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని, కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే అసంతృప్తిగా ఉందన్నారు. ప్రధాని మోదీ రెండుకోట్ల ఉద్యోగాలు, కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ రియాజ్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్, సిరిసిల్ల ఇన్‌చార్జిలు ప్రణవ్‌బాబు, కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు పద్మాకర్‌రెడ్డి, నాగుల సత్యం, సంగీతం శ్రీనివాస్, సత్యప్రసన్నారెడ్డి, విలాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్

- మూఢనమ్మకాలపై అద్భుత అస్త్రం ఇంద్రజాలం
- వినోద, విజ్ఞాన, వికాస, విచిత్రాల మేలు కలయిక
- నేడు ఇంద్రజాలికుల దినోత్సవం





మ్యాజిక్ చేస్తున్న కాస యతిరాజ్

కరీంనగర్ కల్చరల్ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర అంటూ గాలిలో వస్తువులు సృష్టించడం.. మనుషుల్ని ఏ ఆధారం లేకుండా గాలిలో తేలియాడేలా చేయడం... టోపీలోంచి ఏదేదో తీయడం.. నోట్లోంచి బ్లేడ్లు తీయడం.. ఇలాంటివన్నీ ఊహకం దనివే.. ఇంద్రజాలికులు ఇవన్నీ సాధ్యం చేస్తారు. మాటల్లోపెట్టి, మైమరపించి, అద్భుతం అనిపించే విధంగా ప్రదర్శనలివ్వడం ఇంద్రజాలికుల సొంతం. అలాంటి ఇంద్ర జాలికుల దినోత్సవం ఆదివారం జరుపుకో నున్నారు. ప్రతి సంవత్సరం సీనియర్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ఫిబ్ర వరి 23ను ఇంద్రజాలికుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు ఈసందర్భంగా ప్రత్యేక కథనం.

● సామాజిక చైతన్యం కల్పిస్తూ.

ప్రపంచదేశాల్లో భారత దేశ ఇంద్రజాలికులదే అగ్రస్థానం. హస్తలాఘవంతో అద్భుతాలు సృష్టించి వినోదాన్ని పంచే ఈ ప్రక్రియ వేల సంవత్సరాలుగా అలరిస్తోంది. ఇది విజ్ఞాన శాస్త్రమే కానీ క్షుద్ర విద్యకాదు. ఇంద్రజాలికుడు ప్రదర్శించే ప్రతి అంశంలోను ప్రేక్షకుడు గుర్తించలేని వైజ్ఞానిక సూత్రం ఇమిడి ఉంటుంది. పూర్వం రాజుల ఆస్థానాలకే పరిమితమైన ఇంద్రజాలం అనంతర కాలంలో విప్రవినోదులు, సాధనాశూరులు, బైండ్ల, కాటిపాపల, గారడీల వంటివారి ప్రదర్శనలతో సామాన్య జనాలకు చేరువైంది. మాయలు, మంత్రాలు లేకుండా కేవలం ఏకాగ్రత, సమయస్ఫూర్తి, హస్తలాఘవం, విజ్ఞాన శాస్త్రాల్ని మేళవించి చేసే ఇంద్రజాలాన్ని పీసీ సర్కార్, కె లాల్ వంటి వారు దేశ విదేశాల్లో ప్రదర్శించారు. ప్రస్తుతం మనరాష్ట్రంలో వందలాది మంది మెజీషియన్లు ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 24 మంది మెజీషియన్లు ఉన్నారు. వీరు తమ కళా నైపుణ్యంతో మూఢ విశ్వాసాలపై ప్రజలను చైతన్యవంతులుగా చేస్తూ, ఇంద్రజాలాన్ని స్వయం ఉపాధిగా వినియోగిస్తున్నారు. వీరిలో కొందరు వృత్తి రీత్యా ఉద్యోగులు ఉండడం విశేషం. జిల్లా ఇంద్రజాలికులు 1997 సంవత్సరంలో కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ స్థాపించి మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ మల్లేశం, కాస యతిరాజ్ కొనసాగుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లో ఆ ఇద్దరితో పాటు పలువురు మెజీషియన్లు, బాల మెజీషియన్లు తమ ప్రదర్శనల ద్వారా రాణిస్తున్నారు.

సృజనాత్మకత ముఖ్యం..

- ఎస్ మల్లేశం, అధ్యక్షుడు, జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్



మెజీషియన్లు సృజనాత్మకతతో కొత్త పద్ధతి కనిపెట్టి మ్యాజిక్ అభివృదికి కృషి చేయాలి. ప్రభుత్వం మెజీషియన్లను ప్రోత్సహించి భావితరాలకు మ్యాజిక్ అందించేందుకు కృషి చేయాలి. మూఢ నమ్మకాలను పెంపొందించే ప్రచార, ప్రసారాలను నిషేధించాలి.

యువకులు ఉపాధిగా స్వీకరించాలి..

- కాస యతిరాజ్, ప్రధానకార్యదర్శి, జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్



ఇంద్రజాలాన్ని విద్యార్థులకు నేర్పించడం ద్వారా మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయవచ్చు. వైజ్ఞానిక దృక్పథాన్ని అలవాటు చేయవచ్చు. ఇంద్రజాల కళను యువకులు స్వయం ఉపాధిగా స్వీకరించవచ్చు. ప్రభుత్వం పక్షాన ఎన్నో ప్రదర్శనలివ్వడం ఆనందంగా ఉంది. ఇంద్ర జాలికులను ప్రభుత్వం ఆదుకోవ

కొండగట్టులో భక్తుల సందడి


మల్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీకాం త్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

వేములవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై న్యాయవాదులు, న్యాయమూర్తులతో పాటు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. శనివారం వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ మానవ హక్కులపై అవగాహన లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కల్పించడానికే మానవ హక్కుల కమిషన్ ఏర్పడిందని అన్నారు. మానవ హక్కులను కాలరాసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మానవ హక్కుల కమిషన్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికి న్యాయం దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, సీనియర్ సివిల్ కోర్ట్ ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, విద్యాసాగర్‌రావు, పొత్తూరు అనిల్ కుమార్, గొంటి శంకర్, మాదాసు దేవయ్య, లింగాల నారాయణరావు, జి శ్రీనివాస్, బొజ్జ నరేష్, సుదర్శన్, నాగేంద్రబాబు, జనార్దన్, మహిళ న్యాయవాదులు అన్నపూర్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

2.24 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్ర జ్యోతి: హరితహారంలో మొక్కలు నాటేందుకు మండలంలో ఎంత లక్ష్యం నిర్దేశించారు.

ఎంపీడీవో: మండలంలోని 23 గ్రామాలలో 2 లక్షల 24 వేల 500 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించాం.

ఆంధ్రజ్యోతి: లక్ష్యానికి సరిపడేంత మొక్కలు సిద్ధం చేస్తున్నారా?

ఎంపీడీవో: మండల టార్గెట్‌కు అదనంగానే మొక్కలు సిద్ధం చేస్తున్నాం. ఈ సంవత్సరం 47 వేలకు పైచిలుకు ఈత మొక్కలు నర్సరీలలో సిద్ధం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మొక్కల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: మొక్కలు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎండాకాలం మొక్కలు ఎండిపోకుండా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

-పెగడపల్లి

కుంభమేళాకు జిల్లా నుంచి పయనం

-త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం -ప్రయాగ్‌రాగ్ నుంచి వారణాసి, అయోధ్యకు -జిల్లా నుంచి భారీగా వెళ్తున్న జనం

జగిత్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని కుంభమేళాకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. 144 సంవత్సరాలకు ఒకసారి ఇలాంటి అరుదైన కుంభమేళా వస్తుందని ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు వెళ్తున్నారు. జిల్లా నుంచి రైల్వే, విమాన ప్రయాణాల సదుపాయాలు లేకపోవడంతో చాలా మంది రోడ్డు మార్గాన బయలు దేరుతున్నారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు రోడ్డు మార్గాన వెళ్లి అక్కడి నుంచి రైళ్లు, విమానాల్లో కుంభమేళాకు పయనమవుతున్నారు. రోడ్డుమార్గాన వెళ్లేవారు మధ్యలో వచ్చే పవిత్ర ఆలయాలు, క్షేత్రాలు, శక్తి పీఠాలను దర్శించుకుంటున్నారు. త్రివేణి సంగమం చేరుకొని పవిత్ర స్నానం ఆచరిస్తున్నారు. అక్కడి నుంచి దగ్గర లో ఉన్న కాశీ విశ్వనాథుడిని, అయోధ్య బాలరాముడిని దర్శించుకుంటున్నారు.

● శివరాత్రితో ముగియనున్న కుంభమేళా..

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగ, యమున, సరస్వతీ నదుల త్రివేణి సంగమంలో జనవరి 13వ తేదీన కుంభమేళా ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీన శివరాత్రితో ముగియనుంది. గత నెల 29వ తేదీన మౌని అమావాస్య, ఈనెల 3వ తేదీన వసంత పంచమి రోజుల్లో షాహీ (రాజ) స్నానాలు ఉండగా వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. భారీగా భక్తుల తాకిడి ఉన్నప్పటికీ జిల్లా నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో కుంభమేళాకు వెళ్లారు. ఈనెల 12వ తేదీన మాఘ పౌర్ణమి రోజున సైతం భక్తులు అధికంగా వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించారు. ముగింపు రోజైన ఈనెల 26వ తేదీ మహా శివరాత్రి పర్వదినాన భక్తుల సంఖ్య భారీగా ఉంటుందన్న అంచనా ఉంది. శివరాత్రి రోజున త్రివేణి సంగమంలో స్నానం ఆచరించడానికి భారీగా భక్తులు తరలివెళ్తారని



ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న భక్తులు

అంచనా. కొందరు సొంత వాహనాల్లో వెళ్తుండగా, మరికొందరు అద్దె వాహనాలు, ట్రావెల్స్ వాహనాలు, రైళ్లు, విమాన ప్రయాణం ద్వారా వెళ్తున్నారు.

● సమీపంలోని దర్శనీయ ప్రాంతాలు..

జిల్లా కేంద్రం నుంచి ప్రయాగ్‌రాజ్ 970 కిలోమీటర్ల దూరం ఉంది. మార్గమధ్యలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వరకు వెళ్లి నర్మదా నదిని దర్శించుకొని అక్కడ కూడా పవిత్ర స్నానాన్ని కొందరు ఆచరిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ వెళ్లే మార్గంలో శక్తి పీఠాల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లాలో మైహర్ చూస్తున్నారు. అక్కడ శారదామాత రూపంలో అమ్మవారు కొలువుదీరారు. త్రికూట పర్వతంపై గల ఆలయానికి మెట్లతో పాటు రోప్‌వే మార్గం ద్వారా వెళ్లి దర్శనం చేసుకుంటున్నారు. జిల్లా నుంచి తరలివెళ్తున్న భక్తుల్లో కొందరు ప్రయాగ్‌రాజ్‌లో స్నానమాచరించిన తర్వాత కాశీ విశ్వనాథుడిని, అయోధ్య బాలరాముడిని దర్శించుకుంటున్నారు. ఈ మూడు క్షేత్రాలు త్రిభుజాకారంలో ఉన్నందున దర్శనం చేసుకుంటే మంచిదని భావిస్తున్నారు. చాలా మంది ముందుగా ప్రయాగ్‌రాజ్ నుంచి 122 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాశీ చేరుకొని విశ్వనాథుడిని దర్శనం చేసుకుంటున్నారు. అక్కడి నుంచి 220 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో అయోధ్య చేరుకొని బాలరాముడిని దర్శనం చేసుకోవడంపై మక్కువ కనబరుస్తున్నారు. కుంభమేళాకు జగిత్యాల జిల్లా నుంచి వెళ్లిన వారిలో అధిక సంఖ్యలో ప్రయాగ్‌రాజ్‌తో పాటు అయోధ్య, కాశీ దర్శనాలు చేసుకునే వస్తున్నారు. మరికొందరు ప్రయాగ్‌రాజ్ నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉండే చిత్రకూట్‌కు వెళ్లి వస్తున్నారు.

కుంభమేళాకు వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నా

- మైలారపు రాంబాబు, జిల్లా రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు



ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు వెళ్లి త్రివేణి సంగమంలో స్నానమాచ రించడం అదృష్టంగా భావిస్తున్నా. కుటుంబ సభ్యులు, మిత్రులతో ప్రత్యేక వాహనంలో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి వచ్చాం. అక్కడ కాశీవిశ్వనాథుడిని సైతం చాలా మంది భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. విదేశాల నుంచి సైతం కుంభమేళాకు భక్తులు వస్తున్నారు.

కుటుంబమంతా వెళ్లి వచ్చాం

- దువ్వ రాజు, ఆర్యవైశ్య సంఘం నేత, జగిత్యాల



ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకొని కుటుంబ సభ్యులతో కుంభమేళాకు ఇటీవల వెళ్లి వచ్చాం. ప్రయాగ్‌రాజ్ వద్దకు వెళ్లిన తర్వాత అద్దె ద్విచక్ర వాహనాల ద్వారా సంగమం వద్దకు చేరాం. అక్కడి నుంచి సుమారు కిలోమీటరు వరకు కాలి నడకన వెళ్లాం. బోటు ప్రయాణం చేసి త్రివేణి సంగమం వరకు వెళ్లి పుణ్యస్నానం ఆచరించడం మరిచిపోలేని అనుభూతి.

ఎస్సెస్సీలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయ భవన సమావేశ మందిరంలో ఎస్సెస్సీ-2025 పరీక్షల నిర్వహణపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాము మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిల్లావ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి నిర్వహణకు 67మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను, 20మంది వెహికిల్ బాధ్యులు, 28మంది కస్టోడియన్ అధికారులను పరీక్షల నిర్వహణకు నియామకం చేపట్టామని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని సీఎస్‌లు, డీవోలు ముందుగానే సందర్శించాలని అక్కడి వసతులను, పరిస్థితులను సమీక్షించుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎటువంటి పొరపాట్లకు తావివ్వద్దన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ తప్పనిసరిగా మూడు రోజుల ముందుగానే పరీక్ష నిర్వహణ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు లాంటి విషయాలను ముందుగానే సమీక్షించుకోవాలని, ఏదైనా సందేహాలుంటే ముందుగానే నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణ బాధ్యులు సొంత నిర్ణయాలకు ప్రాధాన్యమివ్వకుండా విద్యాశాఖ నిర్ణయించిన నియమాల ప్రకారం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్‌లు, ఏసీజీఈ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్

రాయికల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో మురికి కాలువ ను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం రాయికల్ మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్ల తో సమావేశం నిర్వహించారు. 100 శాతం పన్నులు వసూలు చేయాల న్నారు. వీరి వెంట ఎంపీవో సుష్మా, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ తదితరులు ఉన్నారు.

ఎంపీ అర్వింద్‌కు పసుపు కొమ్ముల మాలతో స్వాగతం

మల్లాపూర్, ఫిబ్రవరి, 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వచ్చిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు నాయకులు పసుపు కొమ్ముల మాలతో స్వాగతం పలికారు. శనివారం మల్లాపూర్ కేంద్రంలో ఓ శుభ కార్యంలో పాల్గొనడానికి వచ్చారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పసుపు మాలతో స్వాగతం పలికినట్లు పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర రాజు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మల్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్వంతాపూర్‌లో రహదారి పనులు ప్రారంభం అయ్యాయి. మల్యాల శివారులో నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్ మీదుగా కరీంనగర్-జగిత్యాల మార్గం వరకు ఏడాదిన్నర క్రితం రూ. 3.29కోట్ల అంచనా వ్యయంతో సుమారు 7కి.మీ పనులకు శంఖుస్థాపన జరగగా బల్వంతాపూర్‌లో రహదారి విస్తరణ, విద్యుత్ స్తంబాల తరలింపు, మురుగుకాలువల పనులు చేపట్టారు. ఆపై రహదారిపై సీసీ పనులు ప్రారంభించకపోవడంతో గ్రామంలో కంకర లేచి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ నెల 7న ఆంధ్రజ్యోతిలో 'నత్తనడకన రహదారి పనులు' శీర్షికన కథనం రావడంతో పలువురు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండురోజులుగా సీసీ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టికాహారం, ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి సూచించారు. జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో వీవోఏలకు ఆరోగ్యం- పౌష్టికాహారంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, ఏపీఎం గంగాధర్, ఏఎన్ఎంలు శైలజ, శ్రీశైల, సీసీలు గంగారాం శ్రీనివాస్, రవీందర్, మరియా, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్‌రాణి, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్, రూరల్, అర్బన్ మండలాల వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

వెల్గటూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల లో ఆదివారం గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న బాలబాలికలు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

కోటిలింగాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గల పరీక్షా కేంద్రానికి బాలబాలికలు గంట ముందే చేరుకొని ప్రవేశ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286 జయంతి వేడుకలను శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ పాత సమావేశ మందిరం ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఎస్సై రాజునాయక్‌లతో పాటు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మల్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, వి.నరేందర్‌రెడ్డికి మద్దతుగా శనివారం మల్యాలలో నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్యం శంకర్, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి, వినయ్, హరినాథ్ పాల్గొన్నారు.

●ఎండపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.నరెందర్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో అక్షర పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసారు. కార్యక్ర మంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, ఎల్లాల అనంత రెడ్డి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్ - పెద్దాపూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల సందర్శన

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామశివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శనివారంరాత్రి కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో ఒక రోజు విద్యార్థులతో కార్యక్రమంలో భాగంగా గురుకులంలో విద్యార్థులతో భోజనం చేసి రాత్రిబస చేశారు. గురుకులం పరిసరాలు పరిశీలించి ఇంకుడు గుంతను పూర్తి స్థాయిలో చేయాల ని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డికి సూచించారు. డైనింగ్ హాల్‌తో పాటు కిచెన్, స్టోర్ రూం, వంట సామగ్రి, పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులు పరిశీలించి చదవుతున్న పదవ తరగతి విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగారు. బోర్డుపై విద్యార్థు లతో గుండె బొమ్మను డ్రాయింగ్ చేయించి వాటిపై ప్రశ్నలు అడిగారు. డార్మెటరీలోని విద్యార్థులను పలకరిస్తూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సౌకర్యవంతంగా ఉందా అని తెలుసుకున్నా రు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా బాధ్యతగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గురుకులంలోని మెడికల్ కిట్‌ను పరిశీలించి విద్యార్థుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు విద్యార్థులతో క్యారం, చెస్ ఆడారు. అనంతరం పాఠశాల డార్మెటరీలో రాత్రి నిద్రించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవీలత, ఆర్ఐ ఉమేష్, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు అన్యాయం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా శనివారం జీవన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ నోటిఫికేషన్ వేస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులు తమకు లైబ్రరీలో కావాల్సిన వసతుల కల్పన గురించి ఎమ్మెల్సీకి వినతి పత్రం అందించారు. శనివారం ఉద యం ఎమ్మెల్సీ దరూర్ క్యాంప్‌లోని రామాలయం వద్ద గల ఓపెన్ జిమ్ వద్ద వాకర్స్‌తో ముచ్చటించారు. ఈ సందర్భంగా నరెందర్‌రెడ్డికి మద్దతు తెలుపాలని ఆయన కోరారు. ఆయ కార్యక్రమాలలో జీవన్‌రెడ్డి వెంట టి పిసిసి అధికార ప్రతినిధి బండ శంకర్, మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, అనుమల్ల జయశ్రీ, పిప్పరి అనిత తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి



నేరెళ్లలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో గల అరబిందో కాన్వెంట్ హైస్కూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దత్తుగా శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, అరబిందో కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ జాజాల రవీందర్ పాల్గొన్నారు.

●బుగ్గారం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని విప్ లక్ష్మణ్ కుమార్ కోరారు. బుగ్గారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ , యూత్ అధ్యక్షుడు సిగిరి అంజిత్ కుమార్, నాయకులు కండ్లె మదన్, తాడేపు లింగన్న, జంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కోరుట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవనంలో కోరుట్ల నియోజకవర్గ కో ఆర్డినేటర్ భాషా వేణు యాదవ్, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

●ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్‌తోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురడి కాపు సంఘం భవనంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- నిజామాబాద్ ఎంపీ అర్వింద్

కోరుట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆరోపించారు. బీసీ కుల గణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారని, దీంతో రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రులు కానరావడం లేదని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ విమర్శించారు. శనివారం పట్టణంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఆత్మీయ సమేళనంలో భాగంగా పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభర్థి కొమురయ్యలతో పాటు జిల్లా నాయకులతో కలిసి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన నిజామాబాదు ఎంపీ అర్వింద్‌తో పాటు బీజేపీ అభ్యర్థులు పార్లమెంట్ స్థాయి నాయకులను బీజేపీ శ్రేణులు, పసుపు రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడారు. 90 శాతం ముస్లింలను బీసీలో చేర్చలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. బీసీలకు అన్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను భూ స్థాపితం అయిందని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధంగా మారుతుందని జోష్యం చేపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రంగ అభివృద్ధికి నిధులు రాష్ట్రాలకు కేటాయిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చొరువతో నిజామాబాదు పార్లమెంట్ పరిధిలో పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేసామని అన్నారు. దేశ ప్రదాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నడుస్తున్న బీజేపీ పార్టీ వైపు అన్ని వర్గాల ప్రజలు చూస్తున్నారని అన్నారు. నరేంద్ర మోది సారధ్యంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ విజయదుందుబి మోగిస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలు మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాటం చేసి సాధిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కరం కొరకు విద్యార్థులతో కలిసి ప్రభుత్వంను నిలదీస్తామని అన్నారు. ఉపాధ్యాయులు నిరుద్యోల తరుపున ఉండి పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, మున్సిపల్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్, పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డి

విద్య, ఉపాధికి బీజేపీ ప్రాధాన్యం

రాయికల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధి, సంక్షేమానికి బీజేపీ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. రాయికల్ పట్టణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రులకు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనందున ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ బలపరిచిన మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కుర్మ మల్లారెడ్డి, మచ్చ నారాయణ, గోపాల్, జి.రాజరెడ్డి, సామల్ల సతీష్, బన్న సంజీవ్, కునారపు భూమేష్, సింగం సతీష్, కడార్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

గొల్లపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లను, పలు షెడ్లను తహసీల్దార్ వరందన్ ఆధ్వర్యంలో ఎక్స్‌కావేటర్ల సహాయంతో శనివారం కూల్చివేయించారు. మండల కేంద్రంలోని రామాలయం వెనకాల గల సర్వే నెం.735, 544 నెంబర్లలో గల ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఇళ్లను, పశువుల షెడ్లను నిర్మించుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఇటీవల పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించి, అక్రమ నిర్మాణాలను కూల్చి వేయించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేష్ రెడ్డి, ఎస్సైలు చిర్ర సతీష్ కుమార్, ఉమాసాగర్, ఆర్ఐ జీవన్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

కోరుట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జువ్వాడి భవనంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి) : ఎల్లంపెల్లి రిజర్వాయర్ నీటిని నియోజకవర్గంలోని చెరువులకు విడుదల చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని శ్రీరాములపల్లి కోమటి కుంట చెరువు కాల్వలో దిగి పరిశీలించారు.

కల్లంలో ఆరబోసిన పసుపు చోరీ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన ఎలేటి వినోద్‌రెడ్డి అను రైతు నాలుగు కడాయిల పసుపును శుక్రవారం ఉడకబెట్టి తన కల్లంలో ఆరబోయగా దుండగులు ఎత్తుకు పోయారు. శనివారం ఉదయం కల్లం వద్దకు వచ్చి చూడగా ఆరబోసిన పసుపు కనిపించకపోవడంతో ఎవరో ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. రూ.30వేల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.

ఫేర్‌వెల్ డే వేడుకలు

జగిత్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జ్యోతి మెమోరీస్- 2కె25 పేరిట నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పాఠశాల అనుభవాలు ఓ విలక్షణమైన మరుపురాని అధ్యాయం అని అన్నారు. కొత్త జీవితాన్ని ఆవిష్కరించే కీలక దశ వీడ్కోలు వేడుక అని, ఇది జీవితానికి తొలిమలుపు అన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ. ప్రణాళికబద్ధంగా ముందుకుసాగి విజయతీరాలకు చేరాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, రజితరావు, హరిచరణ్‌రావుతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్దలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నరసింహమూర్తి, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకోవటం అగుపించింది. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.